# గోమేధికం (రాహువు)

- జ్యోతిష్యరత్న డా॥వేణుగోపాల్ రావు వీరమనేని

గోమేధికం నవరత్నాలలో ఒక ముఖ్యమైన రత్నం. ఇది రాహువునకు సంబంధించినది. రాహువు గురించి క్లుప్తంగ తెలుసుకున్నట్లయితే రాహువు ఛాయాగ్రహము. ఇది ఏస్థానానికి (ఏ రాశికి) అధిపతి కాదు. రాహువు ఏ గ్రహంతో చేరియుంటే ఆ గ్రహం యొక్క లక్షణాలు వస్తాయి. జాతకరీత్యా 3,6,11 స్థానాలకు రాహువు మంచి చేయును. రాహువు జాతకరీత్యా మంచి స్థానంలో ఉన్నను, మంచిగ్రహం కలిసియున్నట్లయితే బంధుజనానికి మంచి చేయును. బంధువుల వలన మంచి జరుగును. స్థానచలనం వలన విద్యలో ఆటంకం ఉన్నను మంచి తెలివితేటలతో ఉత్తీర్ణతనొందెదరు. వివాహ తదితర విషయాలలో పెద్దల మాటను అనుసరింతురు. మంచి ఆరోగ్యంగా ఉండును. రాహువు బలంగా లేనట్లయితే కుటుంబంలో, దగ్గరి బంధువులలో అశాంతి తల్లి, దండ్రులతో సంబంధం బాగుండకపోవడం, దూరదేశప్రయాణాలలో ఇక్కట్లు, సౌఖ్యంలేని జీవనం, సమయపాలన లేని భోజనం, అత్తవారింటిలో బాదలు, కీళ్ళనొప్పులు, కలరా, అతిసారవ్యాధి, శరీరంపై అసహ్యకరమైన జబ్బులు (కుష్టు, బొల్లి) వంటివి వస్తాయి.

రాహువు మంచిస్థానంలో ఉండి ఇంకను మంచి ఫలితాలను సాధించడానికి చెడు ప్రభావం చూపుచున్నప్పుడు ఆ బాదల నుండి బయటపడడానికి రాహు రత్నమైన గోమేధికం వాడవలెను.

గోమేధికాన్ని పలు భాషలలో వివిధ పేర్లతో పిలుస్తారు. అని గోమేధ, పింగస్ పథిక్, త్రినాపర్, పిస్సి, హజార్‌యామని మరియు రాహురత్న.

గోమేధాన్ని ఆయుర్వేదంలో గుండె జబ్బులకు, నరాల బలానికి మరియు నపుంసకత్వమునకు ఉపయోగిస్తారు. భస్మాన్ని తేనెతో కలిపి తీసుకోవలెను. గుర్రపు మూత్రంలో 72 గంటలు గోమేధికాన్ని నానబెట్టి శుద్ధి చేసి, తదుపరి నల్ల ఉమ్మెత్త రసంలో నానబెట్టి, కొలిమిలో ఉంచి భస్మం చేయవలయును. భౌతిక లక్షణాలు పరిశీలించినట్లయితే ధృడత్వం 7.5, గ్రావిటి 4.2 - 4.7 మరియు వక్రీభవనం 1.81 - 1.98, బెరీలియం, జిర్కోనియమ్ ఆక్జైడ్‌లనే రసాయన సమ్మేళనమ్ గోమేధికం.

ఇవి బ్రెజిల్, శ్రీలంక, భారతదేశం, స్విట్జర్‌లాండ్, స్కాట్‌లాండ్, సైబిరీయా దేశాలలో లభిస్తాయి. భారతదేశంలో తమిళనాడులోని కోయంబత్తూరు, రామనాథ్‌పురం, సేలం ప్రాంతాలలో, ఆంధ్రప్రదేశ్‌లోని గూడురు మైకామైన్స్‌లో లభిస్తాయని తెలుస్తుంది.

గోమేధికం ఆవు ముత్యపు రంగులో (బ్రాహ్మణజాతి), ఎరుపు రంగు (క్షత్రియ జాతి), ఆకుపచ్చరంగు (వైశ్యజాతి) అని అంటారు. వీటిలో కొన్ని రకాల దోషాలుంటాయి. అవి త్రాస (బీటలు), రేఖ (గీతలు), బిందు (లోపల మచ్చలు), మల (కాంతి లేకపోవడం) ఇలాంటి దోషాలు గలవాటిని ఉపయోగించినట్లయితే ప్రమాదం సుమా!

గోమేదికాన్ని ధరించినట్లయితే రాజభోగములు అనుభవింపును, చెడు నుండి రక్షణపొందును, శతృవుల మారణకార్యముల నుండి రక్షింపబడుదురు. యుద్ధరంగంలో ఉన్న సైనికులు వీటిని ధరించినట్లయితే మంచి ఉపయోగకారి.

పై వివరణఆధారంగా అందరు ధరించాలనే భావనలేదు. జాతకం ప్రకారం సరైన నిర్ణయము తీసుకొని ధరింపవలెను. ఆర్ధ్ర, స్వాతి మరియు శతభిష నక్షత్రాలలో జన్మించినవారు, రాహు దశ జరుగుతున్న వారు ధరించినట్లయితే అద్భుతఫలితాలనిస్తాయి. సంఖ్యాశాస్త్రం ప్రకారం రాహువుది 4వ సంఖ్య. అందుకే ఏ నెలలోనైనా 4,13,22 మరియు 31వ తేదీలలో జన్మించినవారు ధరించవచ్చు. అదియుగాక ఆరుద్ర నక్షత్రం (1,2,4,5,6 తేదీలు) స్వాతి (1,4 తేదీలు) మరియు శతభిష (1,2,4 తేదీలు)లో జన్మించినవారు గోమేధికాన్ని ధరింపవచ్చు. గాని 3,7,8,9,12,16,17,21,25,26,27,30 తేదీలలో జన్మించినవారు ఆలోచించి ధరించినట్లయితే మంచిది.

గోమేధికాన్ని కెంపు, ముత్యము పుష్యరాగంతో కలిపి ధరింపవద్దు.

2 నుంచి 3 క్యారెట్ల గోమేధంను వెండి లేక అష్టధాతు వుంగరంలో పొదిగి కుడిచేతి మధ్యవేలికి ధరింపవలెను. చాట ఆకారపు గుంటలో పొదగవలెను.

శనివారం సూర్యోదయం అయిన 2 గంటల తదుపరి పూజచేసి ధరింపవలెను. ఆ రోజు ధరించువారు

తారాబలం, తిథిని చూసుకొని రాహువుకు ప్రీతికరమైన గుగ్గిలం, ఇంగువ మొదలయినవి నీటిలో వేసుకొని తలంటుస్నానం చేసి పూజకు ఉపక్రమించవలెను.

పూజా సామాగ్రి:- 1) పాము ప్రతిమ, 2) బూడిద రంగు వస్త్రం, 3) మినుములు, 4) గంధం, 5) కుంకుమ, 6) 22 నాణెములు, 7) పువ్వులు, 8) పసుపు బియ్యం

పూజావిధానము : ఒక పాము ప్రతిమను, బూడిదరంగు వస్త్రంపై పరిచిన మినుములలో పెట్టవలెను. దానిపై వస్త్రం కప్పి మినుములు మరోసారి పర్చవలెను. ఉంగరాన్ని పాలతో, పన్నీటితో కడిగి, గంధం, కుంకుమలతో అలంకరించి, ఒక పూవును దారం సహాయంతో ఉంగరానికి కట్టవలెను. ఆ వుంగరాన్ని మినుములపై ఉంచి దాని చుట్టు 22 నాణెములను 16 పువ్వులను అమర్చవలెను. పసుపు బియ్యము (అక్షింతలు) చేతి లోకి తీసుకొని రాహు మంత్రంను 108 సార్లు జపిస్తూ ఉంగరాన్ని పూజింపవలెను. పూజ తరువాత పంచదార పాలను ప్రసాదంగా పంచవలెను. చివరిగా ఉంగరం ధరించవలెను. పూజకు ఉపయోగించిన వస్త్రాన్ని 17 భాగాలుగా ముక్కలుగా చేసి ప్రతి ముక్కలో కొన్ని మినుములు, ఒక నాణెంను ఉంచి భిక్షకులకు దానం చేయవలయును. మిగిలిన 3 రూపాయలను ఇంటిలో రూపాయలను దాచు స్థలం (డబ్బా)లో ఉంచవలెను. దీనివల్ల శుభం కలుగుతుంది.

రాహు మంత్రం

నాగ ధ్వజాయ విద్మహే
పద్మహస్తాయ ధీమహీ
తన్నో రాహు ప్రచోదయాత్